


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యానబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

## రెండవ భాగం: బెర్లిన్ డ్వీపే డొయిచ్ ఖండే

## చివరి విడత: మలి సందడి (14)

## (అనుమతి పాట్లు **బెర్లిన్‌లో నేను, నా కుటుంబం**)

**మారేజ్ సర్టిఫికెట్** గురించి తనేం చేశాడో తెలుసుకుందామని గుప్తాకి ఫోన్ చేశాను.

ఆశ్చర్యమేమిటంటే గుప్తాని మారేజ్ సర్టిఫికెట్ గురించి అడుగలేదుట.

అతడి అదృష్టం, నా దురదృష్టం!

రెసిడెన్స్ పెర్మిట్ లాంటి విషయాల్లో ప్రత్యేకమైన నియమాలుండవుట.

మనతో డీల్ చేసే అధికారి తనేం చెబితే అదే నియమం.

ఆదేమనడానికి లేదు. ఇలాంటి పరిస్థితి ఇప్పటికీ కొనసాగుతోందని ఆమెరికా వెళ్లడానికి వీసాలకై ప్రయత్నించేవాళ్లందరికీ స్వానుభవమే!

ఈ విషయమై నాకొచ్చిన ఇబ్బందుల గురించి ఆఫీసులో చెప్పాను.

ఇక నా జర్మన్ కొలీగ్స్ ఆశ్చర్యానికి అంతు లేదు.

''విచిత్రం నీలో ఉందో, ఇండియాలో ఉందో తెలియడం లేదు. నీ ద్వారా చాలా కొత్త వింతలు వింటున్నాం. సర్టిఫికేట్ లేకుండా పెళ్లా? మై గాడ్! కల్లో కూడా ఊహించలేం'' అన్నారు వాళ్లంతా ఏకకంఠంతో.

పెళ్లికి సర్టిఫికెట్ అవసరమన్నప్పుడు నేను అంతకంటే షాక్ తిన్నాను. కానీ అదంతా గడిచిపోయిన కథ.

అందుకని వాళ్లతో వాదనకి దిగలేదు.

''సర్టిఫికెట్ మీ కన్సలేట్ ఇస్తుందిలే కానీ, నీ కుటుంబానికి ఇన్సూరెన్సు చాలా అవసరం. ఇప్పటికే తీసుకుని ఉంటావనుకున్నాను. లేకపోతే ఎప్పుడో ఈ విషయమై నిన్ను హెచ్చరించేవాణ్ణి'' అని డెకర్ట్ చెప్పాడు నాకు.

నా కుటుంబానికి ఇన్సూరెన్సు గురించి వాకబు చేశాను.

అప్పటికే నేను ఇన్సూరెన్సుకి నెలకి 18 మార్కులు కడుతున్నాను.

దాన్ని కుటుంబానికి విస్తరించొచ్చుట.

అంటే మా నలుగురికీ కలిపి ఒకటే ఇన్సూరెన్సు.

ఎటొచ్చీ అప్పుడు 18 కాదు, పాతిక మార్కులు కట్టాలి.

డెకర్ట్ నాతో, ''నువ్వు విడిగా తీసుకున్న 18 మార్కుల ఇన్సూరెన్సుకంటే, ఇది చాలా లాభసాటి. ఆ విషయం ముందుముందు నీకే తెలుస్తుంది'' అన్నాడు.

నాకప్పుడు భువనేశ్వర్లో నా కొలీగ్ ఒకతను అన్న మాట గుర్తొచ్చింది.

''ఆస్పత్రినుంచి డిస్చార్జి ఐనప్పుడు వెళ్లొస్తానని చెప్పడం ఎలాంటిదో, ఇన్సూరెన్సు వల్ల కలిగే లాభం అలాంటిది'' అనేవాడతడు.

''కుఛ్ పానే కేలియే కుఛ్ ఖోనా పడ్‌తాహై (కొన్ని పొందాలంటే, కొన్ని పోగొట్టుకోవాల్సి ఉంటుంది)'' అని హిందీ సామెత.

ఇన్సూరెన్సులో పొందేది కొంచెమే కానీ పొగొట్టుకునేది కుంచెడు. కన్నో, కాలో పోతే – ఎన్ని లక్షలు వాటికి సాటొస్తాయి?

ఇక ప్రాణాల విషయానికొస్తే – లాభం ఇన్సూరెన్సు చేసినవాడిక్కాదు, అతడి దగ్గర బంధువులకి!

''నాకే లాభమొద్దు. ముందీ రెసిడెన్స్ పెర్మిట్ వస్తే చాలు'' అన్నాను డెకర్ట్‌తో.

ఇన్సూరెన్సు గురించిన నా భావాల్ని అతడితో పంచుకోవాలనుకోలేదు.

అవి కూడా అతడికి వింతగా అనిపించొచ్చని నా భయం!

ఐతే డెకర్ట్ చెప్పిన లాభసాటితనం, తర్వాతెప్పుడో స్వానుభవమయ్యేక – నా భావాల్లో కొంత మార్పొచ్చింది. డెకర్ట్ సలహా గొప్పతనాన్ని అప్పుడు గుర్తించాను. ఆ విశేషాలు ఇంకో సందర్భంలో ప్రస్తావించుకుందాం.

ఇన్సూరెన్సు ఐపోయేక, శ్రీమతికీ, పిల్లలకీ టీకాలు ఉన్నట్లు సర్టిఫికెట్లు తీసుకున్నాను. అదో రోజు పట్టింది.

రెసిడెన్స్ పెర్మిట్ రావాలంటే – నాకు బెర్లిన్లో నిలువనీడ ఉండాలి.

అంటే ఒలోముచ్‌కీ దగ్గర్నించి మీట్‌ఫెర్‌ట్రాగ్ (రెంటల్ అగ్రిమెంట్) తీసుకోవాలి.

ఇందులో నాకో ఇబ్బంది ఉంది.

ఒలోముచ్‌కీ ఉంటున్నది స్వంతిల్లు కాదు. ఎవరింట్లోనే అద్దెకుంటున్నదామె.

ఆ ఇల్లు తనకి పెద్దదిగా అనిపించి – కొంత పోర్షన్ నాలాంటివాళ్లకి అద్దెకిస్తోంది.

సబ్‌లెటింగ్‌కి ఆమెకి అనుమతి లేదని నా అనుమానం.

ఎందుకంటే అంతకుముందు – అంటే ఇంకా నా భార్యాబిడ్డలు ఇక్కడికి రాకమునుపు – ఒక రోజు ఆమె నాకు చెప్పింది:

''అద్దె ఇళ్లకు సంబందించిన ప్రభుత్వ సంస్థకు సంబంధించిన అధికారులు తనిఖీకి వస్తున్నారు. రేపొక్కరోజుకీ 11–4కి మధ్యలో నువ్వు ఇంట్లో ఉండకూడదు''

ఆమె ఆజ్ఞాపించలేదు. అనునయంగా అడిగింది.

ఎలాగూ నేనది ఆఫీసులో ఉండే సమయం కాబట్టి – నాకు ఇబ్బంది అనిపించలేదు.

విషయం మా ఆఫీసులో చెబితే, ''ఆమె ఏదో తప్పు చేస్తోంది. ఆ తప్పులో నువ్వూ భాగస్వామివౌతావు. వేరే ఇల్లు చూసుకో'' అని కిర్ష్నర్ సలహా ఇచ్చాడు.

మాదీ మాత్రం ఒప్పుకోలేదు, ''ఆమె తప్పు చేసే మాటైతే, యూనివర్సిటీకి సంబంధించిన సంస్థలో తన ఇల్లు అద్దెకిస్తానని రిజిస్టర్ చేయించుకోదుగా! నువ్వామె చెప్పింది పొరపాటుగా అర్థం చేసుకున్నావని నా ఉద్దేశ్యం'' అన్నాడు.

కిర్ష్నర్ నియమాలననుసరించే జర్మన్ పౌరుడు.

మాదీ ఇరాక్ దేశస్థుడు. నాకోసం ఒలోముచ్‌కీ ఇల్లు చూసిపెట్టింది అతడే!

ఎవరిని నమ్మాలి?

అప్పుడు నాకు చిన్నప్పుడు చదివిన జోకొకటి గుర్తుకొచ్చింది.

ఒక ముసలాయన రోడ్డుమీద కళ్లు తిరిగి పడిపోయాడు. చుట్టూ చేరిన జనం తలో సలహా ఇస్తున్నారు. ఒకరు మొహంమీద నీళ్లు చల్లమన్నారు. ఒకరు మంచినీళ్లు తాగించమన్నారు, ఒకరు సోడా ఇమ్మన్నారు. ఓ యువకుడు మాత్రం విస్కీ పట్టించమన్నాడు. చుట్టూ చేరిన జనాలు ఏంచెయ్యాలా అన్న మీమాంసలో ఉంటే – ఆ ముసలాయన ఓ సారి లేచి కూర్చుని, విస్కీ పట్టించమన్న కుర్రాడివైపు వేలు చూపించి, ''ఆ కుర్రాడేదో చెబుతున్నాడు. వినిపించుకోవచ్చుగా' అని మళ్లీ పడిపోయాడు.

ఇప్పుడు నా పరిస్థితి అలాంటిదే!

ఒలోముచ్‌కీ ఇల్లు చౌకగా దొరికింది. ఒకే గదిలో నా కుటుంబమంతా ఉండడానికి కూడా ఒప్పుకుంది.

ఆ ఇల్లు కాదని వేరెక్కడికి వెళ్లినా – ఇంత చక్కని ఏరియాలో, ఇంత తక్కువ ధరకు, సకుటుంబంగా ఉండడానికి ఇల్లు దొరుకుతుందా?

అందుకని ఇప్పుడు నాకు మాదీ మాటలు నమ్మాలనిపించింది.

ఐతే ఒలోముచ్‌కీ మీట్‌ఫెర్‌ట్రాగ్ ఇవ్వడమంటే – తను అద్దెకుంటున్న ఇంట్లో నేను, నా భార్యాబిడ్డలు కూడా ఉంటున్నట్లు కాగితంమీద కమిట్ అవ్వాలి.

ఒప్పుకుంటుందా?

ఒప్పుకోకపోతే ఏంచెయ్యాలి?

తనొప్పుకోకపోతే – రెండు భయాలు.

ఒకటి – ఒలోముచ్‌కీ ఇంట్లో ఉండడం నాకు దినదినగండం కావచ్చన్న భయం. రెండు రెసిడెన్స్ పెర్మిట్‌కి సంబంధించిన ఫార్మాలిటీ ఒకటి లోపిస్తుందన్న భయం. అప్పుడిది మారేజ్ సర్టిఫికెట్‌ని మించిన పెనుసమస్యగా మారదూ!

భయపడుతూనే ఓ రాత్రి నా అవసరం గురించిన లేఖ ఒకటి పోస్ట్‌బాక్సులో వేశాను. అంటే వంటింట్లో ఫ్రిజ్ టాప్‌మీద పెట్టాను.

మర్నాడుదయం ఒలోముచ్‌కీ నన్ను పిలిచింది.

జీవన్మరణ సమస్య.

ఏమంటుందోనని బెరుకుగానే వెళ్లాను.

''అగ్రిమెంటు ఇస్తాను. అద్దె కొంచెం పెంచగలవా?'' అందామె.

అప్పుడు నాకు కలిగిన రిలీఫ్ ఇంతా అంతా కాదు.

హనుమంతుడు, 'చూచితిని సీతను' అన్నట్లు ముందు – అగ్రిమెంటు ఇస్తానని – చెప్పింది అది చాలు!

అద్దె పెంచమనడంలో ఆమె గొంతులో బలం లేదు. ఏదో ఓ బాణమేసి చూద్దాంలే అన్నట్లు అడిగింది. ఎందుకంటే ఆమెకి నా ఆర్థిక పరిస్థితి తెలుసు.

గొంతులో తగినంత వినయాన్ని జోడించి, ''పెంచాలనే ఉంది కానీ నాకు డబ్బు చాలదు. మీట్‌ఫెర్‌ట్రాగ్ ఇస్తానన్నందుకు చాలా చాలా థాంక్స్'' అన్నాను.

ఆమె మరేమనలేదు. మర్నాటికల్లా ఆమె ఆ ఫారాలు సంతకం చేసిచ్చింది.

వాటిలో మేమక్కడ ఎన్నాళ్లుండొచ్చో అన్నది తను వ్రాయలేదు. నేనే నా అవసరాన్నిబట్టి తేదీలేసి నింపుకున్నాను. నా సమస్యలన్నీ ఒక్కసారిగా పటాపంచలైపోయినట్లు తోచి ఎంతో ఉత్సాహంగా అనిపించింది.

అదే ఉత్సాహంలో – ఇంచుమించు వెంటనే ఇండియన్ కన్సలేట్ ఆఫీసుకి సకుటుంబంగా వెళ్లాను. ఆఫీసు చిన్నది. స్టాఫ్ ఐదారుగురికంటే ఉంటుందనిపించదు. వెళ్లగానే మర్యాదగా పలకరించి కూర్చోమన్నారు.

కాసేపటికి ఓ అమ్మాయి మా దగ్గరకొచ్చి నన్ను పలకరించింది. నేను నా పరిస్థితి కాస్త విపులంగానే ఆమెకి చెప్పాను.

ఆమె ఓపిగ్గా నేను చెప్పిందంతా వింది. తర్వాత నెమ్మదిగా, ''ఇప్పుడు మేము మీకు చేయగలిగిన సాయమేమిటి?'' అంది.

రామాయణమంతా విని రాముడికి సీతేమౌతుందని అడిగిన సామెత ఊరికే పుట్టలేదనిపించింది.

ఐతే ఇలాంటి సందర్భాల్లో సహనం అవసరమని నాకు తెలియకపోలేదు.

నా భార్యని చూపించి, ‘‘ఈమెకూ నాకూ పెళ్లి ఐనట్లు సర్టిఫికెట్ ఒకటి ఇవ్వాలి’’ అన్నాను.

ఆమె నవ్వి, ‘‘ఇండియన్ కన్సలేట్లో మారేజ్ సర్టిఫికెట్లు ఇస్తారని మీకెవరు చెప్పారు?’’ అంది.

ఆమె అడిగిన తీరునిబట్టి, ఎగతాళి చేస్తోందా అనిపించింది కానీ సమాధానం నా దగ్గర సిద్ధంగానే ఉంది.

‘‘రెసిడెన్స్ పెర్మిట్ ఇచ్చే కార్యాలయంలో అధికారి చెప్పారు. ఆయన పేరు నాకు తెలియదు. కానీ ఆ ఆఫీసు పుట్‌కామర్ స్ట్రాసేలో ఉంది’’ అన్నాను.

ఆమె ఏ తీరులో మాట్లాడిందో అదే తీరులో బదులిచ్చాను నేను.

ఆమె నన్ను ఎగతాళి చేస్తే, ఆ ఎగతాళిని జర్మన్ అధికారికి మళ్లించాను.

మనవాళ్లు మనవాళ్లని చిన్నబుచ్చినట్లు, తెల్లవాళ్లని చిన్నబుచ్చలేరని నాకు తెలుసు.

ఆమె ఓ క్షణం తడబడింది. తర్వాత నెమ్మదిగా, ‘‘మీరు ఇక్కడికొచ్చేముందే ఇండియాలో ఆ సర్టిఫికెట్ తీసుకుని ఉండాల్సింది’’ అంది. గొంతులో కొంచెం వినయం జోడించింది.

‘‘ఇలాంటి సర్టిఫికెట్ ఒకటి అవసరపడుతుందని ముందుగా ఎవరూ మాకు సూచించలేదు. ఏ సమస్య వచ్చినా భారత పౌరులకు ఇండియన్ ఎంబసీ కానీ, కన్సలేట్‌గానీ సాయపడతారని మాత్రం చెప్పారు’’ అన్నాను.

ఆమె కొంచెం ప్రసన్నంగా నవ్వి, ‘‘ఇలాంటి సర్టిఫికెట్లు ఇవ్వడానికి మాకు ప్రత్యేకమైన అనుమతి లేదు. అందువల్ల సర్టిఫికెట్ మేమిచ్చినా అది చెల్లదు’’ అంది.

‘‘మిమ్మల్ని సర్టిఫికెట్ అడగమన్నవాళ్లు, మీరిస్తే అది చెల్లదని అంటారనుకోను. ఐనా సర్టిఫికెట్ ఇస్తామన్నందుకు చాలా సంతోషం. దాని చెల్లుబడి విషయం నేను చూసుకుంటాను’’ అన్నాను.

నిజానికామె సర్టిఫికెట్ ఇస్తానని అనలేదు. కొంచెం లౌక్యం ప్రదర్శించాను.

‘‘సరే, ఏ బేసిస్ మీద మీకు సర్టిపికెట్ ఇవ్వాలి?’’ అందామె.

‘‘నేను, ఈమె భార్యాభర్తలమని పాస్‌పోర్టులు చెబుతున్నాయి. అది బేసిస్ నంబర్ వన్. నేను ఇండియాలో ప్రభుత్వోద్యోగిని. మా పెళ్లి తేదీ నేనిస్తాను. తప్పుడు సమాచారమిస్తే నా ఉద్యోగం పోవడమే కాదు, జైలు శిక్ష కూడా పడొచ్చు నాకు. కాబట్టి ఆ విషయమై నేను మీకు వ్రాసిచ్చే కాగితం బేసిస్ నంబర్ టూ’’ అన్నాను.

ఆమె శ్రీమతి పాస్‌పోర్టు తీసుకుంది. నాచేత కాగితం వ్రాయించుకుంది.

‘‘సర్టిఫికెట్ ఇప్పటికిప్పుడు ఇవ్వడం అవదా?’’ అనడిగాను.

‘‘మీ రెసిడెన్స్ పెర్మిట్‌కి ఇంకా టైముందిగా? అంత తొందరేమిటి?’’ అందామె.

‘‘ఇక్కడ ప్రతి మనిషికీ ఓ ఐడెంటిటీ కార్డుంటుంది. మాకు పాస్‌పోర్టులే ఐడెంటిటీ. అవి లేకుండా బయట తిరగలేం కదా!’’ అన్నాను.

శ్రీమతి పాస్‌పోర్టు కన్సలేట్ ఆఫీసులో ఉన్నట్లు రసీదొకటి ఇచ్చి, ఇక వెళ్లమందామె.

‘రసీదుకి పది నిముషాలు పడితే, సర్టిఫికెట్‌కి మరో పది నిముషాలు అదనం. ఈమాత్రం దానికి వారం రోజులు గడువెందుకో’ అని మనసులో విసుక్కుంటూ బయటికొచ్చాను.

ఇంటికెళ్లేక గుప్తాకి ఫోన్ చేసి విషయం చెబితే, ‘‘ఇక్కడికొచ్చి పట్టుమని ఏడాది కాలేదు. మన కన్సలేట్ వాళ్లు సర్టిఫికెట్‌కి వారం రోజులే అంటే – సంతోషపడాల్సింది పోయి, తిట్టుకుంటున్నావా?’’ అన్నాడు.

నిజమే – ఇండియాలో క్యాజవల్ లీవుకే నెల్లాళ్లముందు ప్లానింగు కావాలనే బాసులున్నారు. ఏ అప్లికేషనుకైనా కిందనుంచి పై దాకా వెళ్లడానికి కనీసం వారం పడుతుంది.

ఆ సంప్రదాయం బెర్లిన్ వస్తే పోతుందా?

ఎటొచ్చీ ఆ వారంలోగానే కన్సలేట్ మీద చికాకు పెరిగేలా చేసింది కిండర్ గెల్డ్ (సంతాన భృతి) విశేషం.

మన దేశంలో ధరణికి గిరి, గిరికి తరువు, తరువుకి కాయ భారం కాకపోవచ్చు కానీ తల్లికి పిల్ల భారమే! ఆ భావిపౌరులు దేశానికి భారమే!

అప్పట్లో పిల్లలొద్దు బాబోయ్ అని సమాజవాదులూ, ప్రభుత్వం కూడా గోల పెట్టేవారు.

జర్మనీలో భావిపౌరులకి ప్రత్యేకంగా భృతి ఉంది.

డాడ్ సంస్థ కూడా ప్రతి నెలా మా పిల్లలకి చెరో యాభై మార్కులూ భృతిగా ఇస్తోంది.

నేను ఎంబసీకి వెళ్లొచ్చిన మర్నాడే – గుప్తా నాకు ఫోన్ చేశాడు.

డాడ్ వాళ్లు పిల్లలకిచ్చే భృతి (కిండర్ గెల్డ్) ఆపేశారుట.

అందులో కొంచెం బాడ్ న్యూస్. కొంచెం గుడ్ న్యూస్

బాడ్ న్యూస్ ఏమిటంటే – ఇకమీదట – జర్మనీలోని ఏ సంస్థా కూడా సంతానభృతి ఇవ్వదు.

గుడ్ న్యూస్ ఏమిటంటే – ఆ భృతి పంపిణీ బాధ్యతని ఇకమీదట ఆర్బయిట్స్ ఆమ్ట్ (లేబర్ బ్యూరో) అనే ప్రభుత్వసంస్థ స్వీకరిస్తుంది.

ఆర్బయిట్స్ ఆమ్ట్ మా ఇంటికి దగ్గర్లోనే ఉంది. సులభంగానే దొరికింది.

అక్కడ ఫారాలు తీసుకుని కావలసిన వివరాలు నింపి పోలీసు స్టేషన్లో స్టాంప్ వేయించుకుని ఇవ్వాలి.

వాళ్లు ఫారాలు వెంటనే ఇచ్చారు. పోలీసు స్టేషన్లో స్టాంపు వెంటనే వేశారు.

ఆ ఫారాలు తీసుకెళ్లి ఆర్బయిట్స్ ఆమ్ట్‌లో చూపించి, ‘‘ఇప్పుడు నేనేం చెయ్యాలి?’’ అనడిగాను.

‘‘ప్రస్తుతానికి ఇంటికెళ్లు. ఒకటో తారీఖున నీ బ్యాంకు ఆకౌంట్ చెక్ చేసుకో. మొదటి బిడ్డకి 50 మార్కులు, రెండో బిడ్డకి 70 మార్కులు – మొత్తం 120 మార్కులు నీ అకౌంట్లో పడి ఉంటాయి’’ అన్నాడు.

రెండు శుభవార్తలు.

ఒకటి – సంతానభృతికిక ఢోకా లేదు.

రెండు – ఆ భృతి ఇంకో 20 మార్కులు పెరిగింది.

అప్పట్లో జర్మనీలో మొదటి బిడ్డకి 50, రెండో బిడ్డకి 70, మూడో బిడ్డకి 120 మార్కులు, అక్కణ్ణించి ఎంతమంది బిడ్డలుంటే అందరికీ 120 మార్కులు – సంతానభృతిగా చెల్లించేదిట ప్రభుత్వం.

ఇది కుల, మత, జాతి, పౌరసత్వాలతో నిమిత్తం లేకుండా – ఆ దేశంలో పని చేసేవారందరికీ వర్తిస్తుంది.

అంతకాలం డాడ్ మాకు బిడ్డకి 50 మార్కుల చొప్పున సంతానభృతి చెల్లించేది.

ఆ బాధ్యత ప్రభుత్వం స్వీకరించడంతో భృతి మారింది.

కాలానుగుణంగానూ పాలనావిధానంలో మార్పులు అవసరపడుతుంటాయి. ఆ మార్పుల్ని అమలు జరిపే ప్రక్రియ సరళంగానూ, పౌరులకి లాభదాయకంగానూ ఉంటే – ఆ వ్యవస్థని అసలైన వెల్‌ఫేర్ స్టేట్ అనొచ్చు.

సంతానభృతి విషయంలో స్వానుభవం తర్వాత – నాకు ఇండియన్ కన్సలేట్ తీరు చికాకు తెప్పించదూ!

నా శ్రీమతి ఇండియన్ పాస్‌పోర్టులో ఉన్న ప్రకారం – మా ఇద్దరికీ వివాహమైందని ఓ సర్టిఫికెట్ ఇవ్వడానికి వారం రోజులు గడువు కావాలా?

ఇది విన్నప్పుడు ఓంప్రకాష్ కూడా గుప్తాలాగే నవ్వి, ఓ ఒరియా కథ చెప్పాడు.

ఆ కథలో – రోడ్డుమీద చెట్టు కూలి ఓ మనిషిమీద పడింది. ఆ మనిషి బ్రతికే ఉన్నాడు కానీ, ముందా చెట్టుని తొలగిస్తే తప్ప అతడి పరిస్థితి తెలియదు. అతణ్ణి వైద్యానికి పంపడం అవదు.

అతడి అవస్థ చూసిన ఓ మనిషి పోలీసులకి కబురందించాడు. పోలీసులొచ్చేక – ఆ చెట్టుని తొలగించడం సివిల్ సర్వీసెస్ వారి పని అన్నారు. ఆ ఆఫీసుకి వెడితే, ఫిర్యాదు తీసుకునే గుమస్తా సెలవులో ఉన్నాడు. అతడు మర్నాడు వచ్చి ఫిర్యాదు తీసుకుని ఫైలుని పై అధికారికి పంపాడు. అది అలా పైపైకి వెడుతూ నాలుగు చేతులు మారి, శాంక్షన్లు అయ్యేక మళ్లీ గుమస్తా దగ్గరికి వచ్చింది.

అక్కడ ఆ తంతు అలా నడుస్తూనే ఉంది. ఈలోగా ఇక్కడ కొందరు మానవతా వాదులు కష్టపడి ఎలాగో ఆ మనిషిని చెట్టుకిందనుంచి తీసి ఆస్పత్రిలో చేర్చారు.

''ఈ కథని నేనైతే మరోలా ముగించేవాణ్ణి'' అన్నాడు ఓంప్రకాష్.

''ఏముందీ, చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నందుకు ఆ మానవతావాదుల్ని క్షణాలమీద అరెస్టు చేసి ఉంటారు. ఇలాంటి అరెస్టులకి ప్రొసీజర్సుతో పెద్దగా పనుండదుగా'' అన్నాను.

''గ్రేట్ – ఏ విషయాన్నయినా నువ్వూ నేనూ ఒకే కోణంలో ఆలోచిస్తాం'' అంటూ ఓం నా భుజం తట్టి మెచ్చుకున్నాడు.

''మన దేశంలో కాస్త వదువుకున్నవాళ్లంతా ఇంచుమించు ఇలాగే ఆలోచిస్తారు. కానీ అవి ఆలోచనలకీ, వ్యాఖ్యలకీ మాత్రమే పరిమితం. వాటిలో ఏ ఒక్కటీ చేతల్లోకి మారదు'' అని నవ్వాను.

''కదా, అలాంటప్పుడు – నువ్వేమిటీ – మన కన్సలేట్‌వాళ్లు ఫైలు తయారు చేసి పైకీ కిందకీ నడపకుండా – నీ పని వెంటనే ఐపోవాలనుకున్నావ్! అక్కడి అలవాటే ఇక్కడా కొనసాగదా మరి!'' అన్నాడు ఓం.

''అర్థమయింది, నన్ను నా స్టయిల్లోనే కొట్టావ్! బుద్ధొచ్చిందిలే! మన కన్సలేట్‌వాళ్లు అన్నప్రకారం వారం రోజుల్లో సర్టిఫికెట్ ఇచ్చేస్తే – వాళ్లదీ వెల్‌ఫేర్ స్టేట్ వ్యవస్థే అని ఒప్పేసుకుంటాను. సరా!'' అన్నాను.

అన్న రోజుకి ఇండియన్ కన్సలేట్ ఆఫీసుకి వెళ్లాను. ఎటొచ్చీ ఒక్కణ్ణే వెళ్లాను.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments